కాలనీలో లైట్ల బిగింపు

దేవివిహార్ కాలనీలో లైట్లు బిగిస్తున్న దృశ్యం

కామారెడ్డి, మార్చి 31 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవి విహార్ ఫేస్-2లో లైట్లను బిగించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'అంధకారంలో దేవివిహార్ ఫేస్-2' శీర్షికన గత నెల 29వ తేదీన ప్రచురితమైన కథనానికి బీఆర్ఎస్ నాయకుడు, 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి భర్త కాసర్ల స్వామి స్పందించాడు. కాలనీ వాసుల కోసం సొంత ఖర్చుతో ఆరు లైట్లను బిగించారు. దీంతో కాలనీ వాసులు స్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు పట్టించుకోకపోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుడు స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

బస్వన్నపల్లిలో జడకొప్పు కోలాటం

జడకొప్పు కోలాటం ఆడుతున్న యువకులు

రాజంపేట్, మార్చి 31 : మండలంలోని బస్వన్నపల్లిలో ఉగాది సంబురాల్లో భాగంగా రెండోరోజు సోమవారం పోచమ్మ ఆలయం వద్ద యువకులు ఉత్సాహంగా జడకొప్పు కోలాటం ఆడారు. సాయంత్రం గ్రామదేవతలైన పోచమ్మ, ముత్యాలమ్మ, దుర్గమ్మ, పోలేరమ్మ, నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. దుర్గమ్మ గుడి వద్ద దుకాణాలు వెలిశాయి. జాతర నిర్వహించారు. ఎడ్లబండ్ల ప్రదర్శనలో పాల్గొన్నవారికి గ్రామ రెడ్డి సంఘం తరపున బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న యూనియన్ సభ్యులు

మాచారెడ్డి, మార్చి 31 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి నాగరాజు ఈ నెల 11న గుండెపోటుతో మరణించాడు. మాచారెడ్డి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అసోసియేషన్ తరపున రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

నిరసన తెలుపుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ముస్లింలు

కంఠేశ్వర్, మార్చి 31 : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలనే యోచనకు వ్యతిరేకంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలు సోమవారం నిరసన తెలిపారు. రంజాన్ ప్రార్థనల అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ముస్లింలు పాల్గొన్నారు.

రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాల

ఏకోపాధ్యాయ విద్యార్థుల చదువులు గయా..

- ఒకే గదిలో ఐదు తరగతులు..
- విద్యాబోధన లేక విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఇదీ ప్రాథమిక పాఠశాలల దుస్థితి

నాగిరెడ్డిపేట, మార్చి 31 : నాగిరెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో విద్యార్థులకు సరైన విద్యాబోధన అందడంలేదు. ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడిని నియమించడంతో.. విద్యార్థులందరినీ ఒకే చోట కూర్చోబెట్టి 1 నుంచి 5వ తరగతి వరకు పాఠాలు బోధిస్తున్నారు. వారికి ఏ పాఠం ఎవరికి చెబుతున్నారో అర్థకాని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఉపాధ్యాయులు సైతం తాము చేసేది ఏమి లేక మమ అనిపిస్తూ.. చేతులు దులుపుకొంటున్నారు. నాగిరెడ్డిపేట మండలంలో ఉన్నత పాఠశాలలు ఏడు, ప్రాథమికోన్నత పాఠశాలలు 12, ప్రాథమిక పాఠశాలలు 23 ఉన్నాయి. ఇందులో 3,617 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బాలురు 1,973, బాలికలు 1,644 మంది ఉన్నారు. మండలంలో 197 మంది ఉపాధ్యాయులకుగాను కేవలం 144 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో తీవ్రమైన ఉపాధ్యాయుల కొరత ఉన్నది. ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులకు ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులతో నెట్టుకు వస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలు 23 ఉండగా అందులో ఇదే పరిస్థితి నెలకొన్నది. తొమ్మిది పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నెట్టుకు వస్తున్నారు. ఉపాధ్యాయుల కొరతతో.. విద్యార్థులకు సరైన విద్యాబోధన అందడం లేదు. ప్రభుత్వం, విద్యాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించి, మెరుగైన విద్యను అందించాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధర్మారెడ్డి ప్రాథమిక పాఠశాల

పాఠాలు బోధించడం ఇబ్బందిగా ఉంది

పాఠశాలలో ఐదు తరగతులకు ఒక్కడినే ఉపాధ్యాయుడిని. వారికి పాఠాలు బోధించడంలో ఇబ్బందిగా ఉంది. అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నాం. ప్రతి విద్యార్థి 1 నుంచి ఐదు తరగతుల పాఠాలు వింటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాం. పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తే బాగుంటుంది.

- శ్రీనివాస్, రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాల

విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నాం

విద్యార్థులకు మంచి విద్యను అందించలేకపోతున్నాం. ఐదు తరగతులకు ఒకే టీచర్ ఉండడంతో.. వారికి న్యాయం జరగడం లేదు. ఐదు తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి విద్యను అందించడం కష్టంగా ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే.. టీచర్లను నియమించాలి.

- జ్యోతి, ధర్మారెడ్డి ప్రాథమిక పాఠశాల

అలరించిన కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్, తాడ్కోల్‌లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్/లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్, మార్చి 31 : ఉగాది పండుగను పురస్కరించుకొని బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, గంగుల గంగారాం, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, కుర్మరాజు తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్‌లో కుస్తీ పోటీలు నిర్వహించారు. మొదటి కుస్తీ రూ.20 నుంచి రూ. రెండు వేల వరకు కొనసాగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేశ్, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. లింగంపేట మండలం ముంబాజీపేట గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి పవన్ తెలిపారు. చివరి కుస్తీలో గెలుపొందిన మల్లయోధులకు వెండి కడియం బహూకరించినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి రూరల్ మండల పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామంలో సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు గ్రామస్తులను అలరించాయి. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే కుస్తీ పోటీలను గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టారు. పోటీలకు మండలంలోని వివిధ గ్రామాలు, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, మహారాష్ట్ర నుంచి వచ్చిన మల్లయోధులు పోటీలో పాల్గొన్నారు. కొబ్బరికాయ పోటీ నుంచి ప్రారంభమైన పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి.

పోటీల్లో విజేతగా నిలిచిన పిట్లం మండలం గోడ్మెగాం గ్రామానికి చెందిన దత్తుకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మూడు తులాల వెండికడెమును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ అలీ, గ్రామపెద్దలు గంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

'హలో బీసీ.. చలో ఢిల్లీ'కి బయల్దేరిన బీసీ నాయకులు

ఢిల్లీకి బయల్దేరుతున్న బీసీ సంఘం నాయకులు

కామారెడ్డి, మార్చి 31 : ఢిల్లీలో ఈ నెల 2న నిర్వహించే బీసీల పోరు గర్జన సభకు కామారెడ్డి నుంచి బీసీ సంఘం నాయకులు సోమవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఎవరికీ ఇచ్చే భిక్ష కాదని, ఇది బీసీల సామాజిక హక్కు అని, బీసీ రిజర్వేషన్లను ఖచ్చితంగా 42 శాతం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనడానికి బయల్దేరుతున్నామని అన్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి నాగరాజ్ గౌడ్, నాయకులు తదితరులు బయల్దేరి వెళ్లారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, మార్చి 31 : జిల్లా కేంద్రంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకొని వీక్లీ మార్కెట్‌లో తగిన వసతులు కల్పించినా పర్యవేక్షణ కరువైందని బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండ్లు తిరుగుతున్న సమయంలో మున్సిపల్ లైట్లు వెలగలేవన్నారు. ఎన్నిసార్లు మున్సిపల్ ఏఈకి, సంబంధిత అధికారులకు మైక్‌లో చెప్పినా.. ఫోన్ చేసినా స్పందించలేదని అన్నారు. లైట్లు వెలగక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని తెలిపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సంగి మోహన్, మాసుల లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు చెలిమల భానుప్రసాద్, సాయిలు పాల్గొన్నారు.

అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో నిజామాబాద్ విద్యార్థి ఆత్మహత్య

రాహుల్ చైతన్య (ఫైల్)

వర్ని, మార్చి 31: ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో ఉన్న ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ దివ్యాంగ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం కలకలరేపింది. ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న మాదాల రాహుల్ చైతన్య అనే విద్యార్థి హాస్టల్ భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రానికి చెందిన మాదాల కృష్ణప్రసాద్, స్వర్ణలత దంపతుల పెద్ద కుమారుడైన మాదాల రాహుల్ చైతన్య ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్‌లో ఉన్న ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి కళాశాల హాస్టల్ భవనం ఐదో అంతస్తు నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని బయటికి పొక్కకుండా కొందరు అధికారులు రహస్యంగా ఉంచడంతో స్థానికులు అక్కడి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. సదరు పోస్టు వైరల్ కావడంతో గమనించిన అధికారులు వెంటనే పోలీసులతో పాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రాహుల్ చైతన్య తల్లిదండ్రులు ఆదివారం అలహాబాద్‌కు బయల్దేరారు. రాహుల్ చైతన్య ఆత్మహత్యకు గల కారణాలు ఏంటని అధికారులను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆత్మహత్యకు కారణాలు మాత్రం తెలియడంలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రాహుల్‌చైతన్య చదువులో ముందుండడంతోపాటు ఇటీవల ఈడబ్ల్యూఎస్‌లో ఆలిండియాలో 52వ ర్యాంకు వచ్చిందని స్థానికులు, కుటుంబీకులు తెలిపారు. మృతుడికి అభిరామ్ అనే సోదరుడు ఉన్నాడు. రాహుల్ చైతన్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ చైతన్య మృతితో వర్ని మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా రంజాన్ పండుగ

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పోచారం

షేక్ జుబేర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 31 : జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నూతన వస్త్రాలు ధరించి యువకులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉదయమే ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బాన్సువాడలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని తైసిల్ మస్జీద్ దగ్గరలోని షాహీ ఈద్గా వద్ద రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ చైతన్యారెడ్డి రంజాన్ వేడుకలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఇంటికి బీఆర్ఎస్ నాయకులు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, సాయిబాబా, మొగులయ్య, శంకర్, గోపాల్, సంజయ్ యాదవ్, జావీద్, మంజూర్, రజాక్, చాకలి సాయిలు , శివసూరి, రమేశ్ యాదవ్ ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని బాన్సువాడలో సీఐ అశోక్ నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బాన్సువాడ, కామారెడ్డి మండలాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సోమార్‌పేట్ బేస్‌లోని ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలతో ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఈద్గా వద్దకు చేరుకొని ముస్లిం పెద్దలు, సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పెద్ద కొడప్‌గల్, పిట్లం మండలాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పిట్లం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలను శాలువాలతో సన్మానించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ విజయ్, వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల లక్ష్మణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు. నిజాంసాగర్, రామారెడ్డి , లింగంపేట మండలాల్లో ప్రజలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎస్టీ సెల్ కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన గిరిజన కార్యవర్గం

లింగంపేట, మార్చి31: మండలంలోని ముంబాజీపేట తండా ఎస్టీ సెల్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్ తెలిపారు. తండా కమిటీ అధ్యక్షుడిగా రమావత్ మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, రాజును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండావాసులు రవి, గోవింద్, రాజేశ్, ప్రకాశ్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట, మార్చి 31: మండలంలోని శెట్పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సోమవారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పది లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్టెం శ్రీనివాస్, నగేశ్, భైరయ్య, మల్లయ్య, సుప్పాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు బంగారం, వెండి వస్తువులు సమర్పించిన జడ్జి

హుజూరాబాద్ కోర్టు జడ్జి పద్మసాయిశ్రీని సన్మానిస్తున్న సభ్యులు

నాగిరెడ్డిపేట, మార్చి 31: మండల కేంద్రం గోపాల్‌పేట నల్లపోచమ్మ అమ్మవారికి బంగారం, వెండితో తయారు చేసిన పుస్తెమట్టెలు, ముక్కుపుడక, వెండికండ్లు, బొట్టును కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కోర్టు జడ్జి పద్మసాయిశ్రీ సోమవారం బహూకరించారు. స్వయంగా జడ్జి తన ఇంటి నుంచి ఒడి బియ్యంతో వచ్చి అమ్మవారికి బహూకరించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, సభ్యులు కిరణ్, కాంత్‌రెడ్డి జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గోపాల్‌పేట గ్రామంలోనే అమ్మవారి గుడిపక్కనే పుట్టి పెరిగినట్లు, అమ్మమ్మ, తాత గోప సక్కుబాయి, పెంటయ్య వద్ద బాల్యం గడిపినట్లు గుర్తు చేసుకున్నారు.

బేగంపూర్‌లో పంచాంగ శ్రవణం

పెద్దకొడప్‌గల్, మార్చి 31 : పెద్ద కొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ గ్రామ హనుమాన్ ఆలయంలో ఉగాది పండుగ పురస్కరించుకొని పురోహితుడు శ్రీపత్ జోషి పంతులు సోమవారం పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I KOTHURU SURESH(OLD NAME) S/O KOTHURU BAJANNA,CHENGE MY NEW NAME AS **KOTHUR SURESH S/O KOTHURU BAJANNA** ,H NO: 5-124/1, BLOCK NO 3 ALOOR,ARMOOR, NIZAMABAD.

NTZ -338575

CHANGE OF NAME

★ I KOTHURU RAJAMANI (OLD NAME) W/O KOTHURU SURESH, CHENGE MY NEW NAME AS **KOTHUR CHINNU BAI** W/O **KOTHUR SURESH**, H NO: 5-124/1, BLOCK NO 3 ALOOR ARMOOR NIZAMABAD.

NTZ - 338575

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కలకలం రేపుతున్న ఆవుల దొంగతనాలు

హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బిచ్కుంద, మార్చి 31 : మండల కేంద్రంలో హనుమాన్ మందిరానికి సంబంధించిన ఆవులు నెల రోజుల నుంచి చోరీకి గురవుతున్నాయి. ఒక యజమాని తన ఇంటి ముందు కట్టేసిన నాలుగు ఆవులకు దొంగలు మత్తు ఇంజక్షన్ ఇచ్చి దొంగిలించే ప్రయత్నం చేయగా యజమాని గమనించడంతో దుండగులు అక్కడినుంచి పారిపోయారు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డ్ అవ్వడంతో అప్రమత్తమయ్యారు. ఇలాంటి ఘటనలు ఇది వరకూ చాలా సార్లు జరిగాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసు అధికారులు పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన శనివారం పునరావృతం కావడంతో బాధితులు గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు తరలివెళ్లి సోమవారం ఫిర్యాదు చేశారు. నెల రోజులనుంచి 20 ఆవులు చోరీకి గురయ్యాయని, ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి దొంగిలించే దొంగల చెరనుంచి ఆవులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బజరంగ్‌దళ్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నల్లపోచమ్మ జాతర ఉత్సవాలు

రుద్రారం గ్రామంలో బోనాలతో శోభాయాత్రగా వస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట, మార్చి 31: మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలను శుభ్రంగా కడిగి, రంగులతో అలంకరించి, మామిడి ఆకులు, రంగు రంగుల తోరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక బోనాన్ని తీసి భక్తి శ్రద్ధలతో శోభాయాత్రగా బయలుదేరారు. శివసత్తుల పూనకాలు, సాంప్రదాయ నృత్యాలతో కొనసాగిన శోభాయాత్ర అందరినీ అలరించింది. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో నల్లపోచమ్మ అమ్మవారికి ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని భక్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట నల్లపోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమాన్వితమైన అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం ఆలయం ముందు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కొబ్బరి కాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా నల్లపోచమ్మ తల్లి బోనాల పండుగా కన్నుల పండువగా సాగింది. గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట, చీనూర్,వాడి గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను తయారు చేసుకొని అమ్మవారికి ప్రదర్శించి మొక్కలు తీర్చుకున్నారు. గో